మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు


8లో..

- కాళేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ అధికారులు
- మెరుగైన సదుపాయాలపై సమీక్ష

వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 159
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
మార్చి 20, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



# అన్నదాత కన్నీరు

## అడుగంటిన జలాలు.. ఆగమవుతున్న రైతన్నలు





- పొట్ట దశలో ఎండుతున్న వరి పంట
- సన్నని ధారగా పోస్తున్న బోర్లు
- ఎడారిని తలపిస్తున్న మానేరు
- పశుగ్రాసంగా మారుతున్న పంట పొలాలు

మార్చి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. గత వారం పది రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. సమీపంలోని మానేరు ఎడారిని తలపిస్తోంది. బోర్ల నుంచి చుక్క నీరు రావడమే గగనమైంది. దీంతో సాగునీరులేక అన్నదాతలు కన్నీళ్లు పెడుతున్నారు. యాసంగి పంటలకు నీటి తడులు అందించలేక రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. చాలా ప్రాంతాల్లో వరి పంట పొట్టదశలో ఉంది. పంట చేతికి రావాలంటే మరో నెల రోజుల పైనే పట్టే అవకాశం ఉంది. ఇప్పుడు సరిపడినంత నీరు అందిస్తేనే పంట దిగుబడి పెరుగుతుంది. ఈ సమయంలో సాగునీరు లేకపోవడంతో చేతికొచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతోందని రైతన్నలు దిగాలు పడుతున్నారు. చేసేదిలేక పంట పొలాలను పశుగ్రాసానికి వదిలేస్తున్నారు.

-వరంగల్ వాయిస్, మల్హర్

వివరాలు2లో..






2లో..

## బల్దియా బడ్జెట్ రూ.1071.48 కోట్లు

- మేయర్ సుధారాణి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఆమోదం
- విలీన గ్రామాలకు నిధుల పెంపు
- రూ.187 కోట్ల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ రిలీజ్
- సర్వతోముఖాభివృద్దే లక్ష్యం.. మంత్రి కొండా సురేఖ


8లో..

## కాంగ్రెస్ అంటేనే సంక్షేమం

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- రూ.10 కోట్ల పనులకు శంకుస్థాపన





8లో..

## షటిల్ లో కేశవమూర్తి జట్టు విజయం

- 15-6 ,15-7 స్కోరుతో విజయ దుందుభి
- గోవాలో 47వ జాతీయ మాస్టర్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

# అన్నదాత కన్నీరు





- అడుగంటిన జలాలు.. ఆగమవుతున్న రైతన్నలు
- పొట్ట దశలో ఎండుతున్న వరి పంట
- సన్నని ధారగా పోస్తున్న బోర్లు
- ఎడారిని తలపిస్తున్న మానేరు
- పశుగ్రాసంగా మారుతున్న పంట పొలాలు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మల్హర్ మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వరి సాగు చేశారు. సీజన్ ఆరంభంలో వాగులు, బోర్లలో నీరు సమృద్ధిగానే ఉన్నప్పటికీ మార్చి నెల ప్రారంభం నుంచి ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఒక్కసారిగా భూగర్భ జలాలు కనివిని ఎరుగని రీతిలో పడిపోయాయి. కొన్ని బోర్లు పూర్తి స్థాయిలో ఎండి పోయాయి. అడుగంటిన బోర్లనుంచి నీరు సన్నని ధారగా రావడంతో అవి ఎటూ సరిపోవడం లేదు. మండలానికి సరిహద్దులోనే ఉన్న మానేరు నదిలో చుక్క నీరు లేక ఎడారిని తలపిస్తోంది. మానేరు నదిపై పీవీ నగర్ సమీపంలో నిర్మించిన చెక్ డ్యాంలో సైతం నీరు అడుగంటి పోయాయి. దీంతో పంటను కాపాడుకోవడానికి రైతులు మరికొన్ని పైపులను బోర్లలోకి దించుతున్నారు. అయినా పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదు.

### కాలిపోతున్న మోటర్లు..

బోర్లలో చాలినంత నీరు లేక మోటార్లు ఆగుతూ పోస్తుండటంతో మోటార్లపై అధిక భారం పడి అవి కాలిపోతున్నాయి. వాగులు, చెరువుల్లో సైతం నీరు ఎండలకి పూర్తి స్థాయిలో అడుగంటి పోయాయి. పొట్ట దశలో ఉన్న పంట చేతికి అందాలంటే కనీసం మరో నెల రోజులైనా నీరు అందించాల్సి ఉంటుంది. ఈ దశలో వరి ఎండిపోతే పెట్టు బడి సైతం రాక రైతులు అప్పుల పాలు అయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎదురుచూపులు..

గత రెండు సంవత్సరాలుగా పరిస్థితి మరింత దారుణంగా తయారు అయింది. గతంలో అన్నారం, సరస్వతి బ్యారేజి లో నీరు ఉన్న సమయంలో ఈ స్థాయిలో భూ గర్భ జలాలు అడుగంటిపోయిన పరిస్థితి రాలేదని రైతులు అంటున్నారు. మరమ్మతుల పేరుతో గత రెండు సంవత్సరాలుగా బ్యారేజీలలో నీరు నింపక పోవడంతో మార్చి నెల ప్రారంభంలోనే భూ గర్భ జలాలు అడుగంటి పోయి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందంటున్నారు. రేపటి నుంచి మూడు రోజులు పాటు తెలంగాణలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలపడంతో రైతులు వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఒక్క వర్షం పడితే పరిస్థితి కొంతలో కొంత మెరుగయ్యే పరిస్థితి ఉందంటున్నారు. లేకుంటే రైతులకు మిగిలేది కన్నీళ్లే అంటున్నారు.





# బల్దియా బడ్జెట్ రూ.1071.48 కోట్లు




- మేయర్ సుధారాణి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఆమోదం
- విలీన గ్రామాలకు నిధుల పెంపు
- రూ.187 కోట్ల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ రిలీజ్
- సర్వతోముఖాభివృద్దే లక్ష్యం.. మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించిన 2025–26 సంవత్సరానికి గాను ముసాయిదా బడ్జెట్ రూ.1071.48 కోట్ల అంచనాలను మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన గురువారం పాలక వర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో రూ.337.38 కోట్లు సాధారణ పన్నుల ద్వారా, రూ.728.10 కోట్లు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ. 600 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతుందని అంచనా వేశారు. వరంగల్ మహా నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశాన్ని గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశానికి 1/3 కోరం హాజరైన తదుపరి బడ్జెట్ సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా మాజీ కౌన్సిలర్ ఏకుల కొర్నేల్ మరణం పట్ల కౌన్సిల్ రెండు నిమిషాల మౌనం పాటించింది. అనంతరం బల్దియా అకౌంట్స్ అధికారి సరిత బడ్జెట్ అంచనాలను చదివి వినిపించారు.

### మేయర్ గుండు సుధారాణి ..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశనంలో జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానికి మంత్రి కొండా సురేఖ, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. అందరి సహకారంతో రానున్న రోజుల్లో వరంగల్ నగరాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ నగర అభివృద్ధికి బడ్జెట్ దిక్సూచి అని, ప్రజలపై భారం లేకుండా పాలకవర్గ బడ్జెట్ ను ప్రవేశ పెట్టామన్నారు. బల్దియాకు సొంతంగా వచ్చే ఆదాయం రూ.337.38 కోట్లలో రూ.100 కోట్లను సిబ్బంది జీత భత్యాలు, రూ.29.92 కోట్లు పారిశుద్ధ్య నిర్వహణకు, రూ.34.30 కోట్లు విద్యుత్ చెల్లింపులకు, రూ.33.74 కోట్లు గ్రీన్ బడ్జెట్ కు, రూ.41.05 కోట్లు ఇంజనీరింగ్ విభాగానికి, రూ.21.15 కోట్లు సాధారణ నిర్వహణకు, రూ.1.40 కోట్లు టౌన్ ప్లానింగ్ కోసం, రూ.1.50 కోట్లు డిజాస్టర్ రెస్పాన్స్ కొరకు కేటాయించడం జరిగిందన్నారు.



### విలీన గ్రామాలకు..

విలీన గ్రామాలు, బలహీనవర్గాలు నివసించే ప్రాంతాలలోని మురికివాడల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 24.77 కోట్లు, అలాగే ప్రజా సౌకర్యాల కల్పన, పార్కుల అభివృద్ధి, జంతువధ శాలలు, వీధి వ్యాపారులు వెండింగ్ జోన్లు, ఓపెన్ జిమ్ ల ఏర్పాటుకు రూ.10.40 కోట్లు, వార్డుల వారిగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను రూ.39.15 కోట్లు కేటాయించామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రూ.187 కోట్ల స్టాంప్ డ్యూటీ ఫండ్స్ ను ముఖ్యమంత్రి మంజూరు చేయడంతో ఈ సంవత్సరం బడ్జెట్ పెరిగిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు, ఎలక్ట్రికల్ వర్కర్స్ లకు జీతభత్యాలు పెంచడానికి స్లమ్ ఏరియాస్ లో అభివృద్ధికి 1/3 బడ్జెట్ కేటాయించుటకు తోడ్పడిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కుల గణన, ఎస్సీ కుల గణన చేసి అసెంబ్లీలో ఆమోదించినందుకు కౌన్సిల్ పక్షాన మేయర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, డిప్యూటీ మేయర్ రిజ్వాన శమిమ్ మసూద్, కార్పొరేటర్లు, బల్దియా వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సర్వతోముఖాభివృద్దే లక్ష్యం..: మంత్రి కొండా సురేఖ

గ్రేటర్ వరంగల్ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా 2025–26 సంవత్సరపు బల్దియా మహా బడ్జెట్ ను రూ.1071.48 కోట్లతో ప్రవేశపెట్టి ఆమోదించుకోవడం జరిగిందన్నారు. ఈ అభివృద్ధిలో మనమందరం భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరంపై ప్రత్యేక దృష్టి సారించి నగరాన్ని అన్ని విధాల సుందరంగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో టెక్స్ టైల్ పార్క్, విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, స్ట్రాంగ్ వాటర్ డ్రైన్, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ల ఏర్పాటుకు శరవేగంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా వరంగల్ నగరాభివృద్ధికి అందరు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మంజూరైన బడ్జెట్ ను పూర్తిగా వినియోగించికొని గ్రేటర్ వరంగల్ లోని అన్ని డివిజన్లలో సమానంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నగరంలోని ఖాళీ స్థలాలకు పన్ను విధించి, అక్రమ కట్టడాలు జరగకుండా అనుమతి పొంది ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటే బల్దియా ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించి వ్యాపారం చేసుకునేలా ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు.

# బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి నిధులెక్కడ?

■ బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు



**హనుమకొండ, వరంగల్ వాయిస్ :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి తగినంత నిధులు కేటాయించకపోవడం అన్యాయమని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు విమర్శించారు. గురువారం సుబేదారిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ. 20,000 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. గత బడ్జెట్‌లో రూ. 9,300 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం రూ. 11,405 కోట్లు మాత్రమే కేటాయించడం బీసీలకు తీవ్ర అన్యాయమన్నారు. తెలంగాణలో 56% బీసీ జనాభా ఉన్నప్పటికీ, గత బడ్జెట్‌లో 3.2% మాత్రమే నిధులు కేటాయించగా, ఈసారి కేవలం 3.7% కేటాయించడం వల్ల బీసీల సంక్షేమం కుంటుపడుతుందన్నారు. మొత్తం రూ. 3 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కనీసం రూ. 20,000 కోట్లు కేటాయించలేరా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి రూ. 47,456 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు గత బడ్జెట్‌లో కేటాయించిన విధంగానే ఈసారి కూడా నిధులు కేటాయించారని, వివిధ కుల సమాఖ్యలకు నిధుల పెంపు జరగలేదని తెలిపారు. కేటాయించిన తక్కువ నిధులను సైతం పూర్తిగా ఖర్చు చేయకపోవడం బీసీలకు మరింత అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు రమేష్, సతీష్, బీసీ విద్యార్థి నాయకులు వినయ్ చారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య రంగాన్ని విస్మరించిన తెలంగాణ ప్రభుత్వం




**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం పట్ల చిత్తశుద్ధి లేదని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగానికి కేటాయించిన నిధులను చూస్తే స్పష్టమవుతుందని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ఆరోపించారు. ఇది విద్యార్థుల పట్ల వ్యతిరేకంగా వ్యవహరించే ప్రభుత్వం అని ఆయన విమర్శించారు. నక్కలగుట్ట ప్రాంతంలో జరిగిన ఏఐఎఫ్‌డీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా అభివృద్ధికి 30 శాతం అధిక నిధులు కేటాయించాలని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కళ్ల జోళ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆర్బీఎస్కే వర్ధన్నపేట టీం బి ఫిబ్రవరి నెలలో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్ ఉర్సు గుట్ట విద్యార్థినులకు వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా దృష్టిలోపం ఉన్న విద్యార్థినులకు గురువారం ఆర్బీఎస్కే ద్వారా ఉచితంగా కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గణేష్ యాదాల, డాక్టర్ రజిత, ఫార్మసిస్ట్ స్వాతి, సమీనా ఏఎన్ఎం, ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ ప్రియా తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లు ఆమోదం చరిత్రలో మైలురాయి



**వరంగల్ వాయిస్, కేయూ:** బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద బీసీ బిల్లు శాసనసభ, శాసనమండలిలో ఆమోదం పొందిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా, ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలకమండలి సభ్యుడు చిర్ర రాజు గౌడ్ మాట్లాడారు. బీసీ సెల్ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్, రీసెర్చ్ స్కాలర్లు నిమ్మగోటి రాములు, రవి, బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు అజయ్ సింగ్, ప్రచార కార్యదర్శి వేణుగోపాల్ గౌడ్, జితేందర్, ముత్యాల శ్రీ సాయి, నితిన్, ప్రశాంత్, మురళి, అన్వేష్, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీతాల కోసం వాచర్ల ఆందోళన



**వరంగల్ వాయిస్, మల్లూర్ :** మండలంలోని కాపురం, శాత్రాజ్ పల్లి ప్లాంటేషన్ లలో పని చేసిన వాచర్లు వారి జీతాలు చెల్లించాలని గురువారం మండలంలోని కొయ్యూరు రేంజి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ప్లాంటేషన్ లో పని చేసిన ఆరుగురు వ్యక్తులలో ఒకరికి ఆరు నెలలు, మరో నలుగురికి మూడు నెలలు, ఒకరికి నెల జీతం పెండింగ్ లో ఉందని అధికారులను అడిగితే దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తా



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 32వ డివిజన్ లోని వినాయక కాలనీలో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి గురువారం పర్యటించారు. వినాయక కాలనీలో రోడ్లు, కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నాయని వాటిని మళ్లీ నిర్మించాలని స్థానికులు ఈ సందర్భంగా కార్పొరేటర్ ను కోరారు. స్పందించిన కార్పొరేటర్ సమస్యలకు త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మర్కజి బడిలో మంచినీటి వసతి ఏర్పాటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పాఠశాల విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు పానుగంటి స్వరూప్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంచినీటి వసతి ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. రామారావు మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ నీటి వసతి రానున్న ఎండాకాలంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గురువారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో, 2021లో అకాల మరణం చెందిన సాంఘిక శాస్త్ర బోధనోపాధ్యాయుడు పానుగంటి స్వరూప్ రెడ్డి స్మృతిగా, ఆయన సతీమణి పి.సరితా రెడ్డి, కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారంతో ఈ ట్రస్ట్ ఏర్పాటైంది. ట్రస్ట్ ద్వారా పాఠశాల విద్యార్థుల కోసం సుమారు రూ.20,000 విలువైన నీటి ట్యాంకును ఏర్పాటు చేసి, మంచినీటి వసతిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రంగారెడ్డి, వలస పైడి, దుపాటి కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నీటి ట్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన యౌవన వీరులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. పీడీఎస్ యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 30 వరకు 94వ వర్ధంతి వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు, ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్‌లు మాట్లాడారు. వారు, సామ్రాజ్యవాద విధానాలను అమలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధోరణులకు వ్యతిరేకంగా భారత విద్యార్థి, నిరుద్యోగులు పోరాడాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న బీజేపీ మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా కోశాధికారి సామాజి పవన్, జిల్లా నాయకులు ఉడత గణేష్, రాజేష్, అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ




**వరంగల్ వాయిస్, వరంగల్:** భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను వరంగల్‌లోని ఎల్బీ నగర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాద్రీ మాట్లాడుతూ, భగత్ సింగ్ జీవితం భారత యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుల త్యాగాలను నేటి సమాజానికి తెలియజేయడం పాలకుల బాధ్యతని ఉద్ఘాటించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేసిన ఆయన, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు. ఈ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా క్రీడోత్సవాలు, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం, యువ కవి గాయకుల సమ్మేళనం, రక్తదాన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు, సదస్సులు, ర్యాలీలు, కాగడాల ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, అహ్మద్ అజ్జు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 20, 2025

## విద్యార్థుల విజయం ప్రేరణగా నిలవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** గవర్నమెంట్ పాలిటెక్నిక్, వరంగల్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిప్లొమా విద్యార్థులు సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌లో "స్మార్ట్ ప్రెగ్నన్సీ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్ విత్ ఏఐ" ప్రాజెక్ట్‌తో పాల్గొని ప్రథమ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులు జి. విశాల్, ఏ.రేవంత్, టి.శ్రీచరణ్, బి. రఘువీర్ ప్రసాద్, ఎండీ షాహ్బాజ్, జి.వర్షిత్ రాజుల ప్రతిభను గుర్తించి, ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్ గురువారం హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కృత్రిమ మేధస్సు (AI) ఆధారంగా గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని సమగ్రంగా పర్యవేక్షించేందుకు రూపుదిద్దుకున్నదని ఆయన వివరించారు. ఇందులో ప్రత్యేక సెన్సార్ల సహాయంతో బ్లడ్ ప్రెజర్, బ్లడ్ షుగర్, హార్ట్ రేట్ వంటి ఆరోగ్య సూచికలను నిరంతరం ట్రాక్ చేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అలర్ట్స్ పంపే విధంగా రూపొందించారని తెలిపారు. ఇది వైద్య నిపుణులకు త్వరిత స్పందన, ప్రాథమిక చికిత్స, రిస్క్ మేనేజ్మెంట్ లో సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ విజయానికి మార్గదర్శకులుగా గైడ్ అనంతోజు స్రవంతి, మెంటార్ శాంతరాజు, అలాగే కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగ ఇన్‌చార్జ్ ఎస్. రవీందర్, సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు అందుకున్నారు. విద్యార్థుల కృషి, సృజనాత్మక ఆలోచనలు, బోధకుల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమైందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలకు ఇది ప్రేరణగా నిలవాలని ప్రిన్సిపాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదించబడిన సందర్భంగా, డోర్నకల్ అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మందకృష్ణ మాదిగ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు రేవంత్ రెడ్డి, డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్, మరియు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్ల చిత్రపటాలకు ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు బీఆర్. వీరస్వామి, ఏపూరి రమణ, గాజుల వేణుగోపాల్, మాతంగి అనిల్, పేరాల నరసయ్య, కొత్తపల్లి నర్సింగ్, ఏసోబు, శ్రీకాంత్, బన్సీలాల్ ప్రవీణ్, ఏపూరి అన్వేష్, పుట్టల వెంకటేశ్వర్లు, పుట్టల క్రాంతి, జన్నరాజు, చిలుకా మనోజ్, బోనగిరి భిక్షపతి, దాసరి మల్లయ్య, బండారి పెల్లి బసవయ్య, తాండూరి శ్రీనివాస్, గణపాక స్వామి, గ్యార పోల్జన్, వీరదాసు లచ్చయ్య, రెంటాల ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొత్త రుద్రారం ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలనా దినోత్సవం, పాఠశాల వార్షిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అని శెట్టి శైలజ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ప్రతి పనిని బాధ్యతగా తీసుకొని క్రమశిక్షణతో నిర్వహించాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని తెలిపారు. స్వయం పాలనలో భాగంగా పాఠశాల నిర్వహణ బాధ్యత చాలా చక్కగా నిర్వహించిన ఐదవ తరగతి విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రగిరి శ్యామల, ఉపాధ్యాయులు అరుణ, శ్రీధర్, వెంకట్ రామ్ రెడ్డిలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్స్‌తో మాస్ కాపీయింగ్‌కు లోపాయికారీ ఒప్పందం

- ఆరోపిస్తున్న డీఎస్ఎఫ్ఐ నేతలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సహాయపడేందుకు కొందరు ప్రభుత్వ టీచర్లు లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు గుగులోతు సూర్యప్రకాశ్, సాయి కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్యాయం జరిగితే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ, రేపటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా విద్యాశాఖ అధికారులతో పాటు సెంటర్ సీఎస్, డీఓ, ఇన్విజిలేటర్లు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన పదవ తరగతి పరీక్షల సన్నాహక సమావేశంలో డీఈఓ స్వయంగా 100శాతం రిజల్ట్ తనకు గిఫ్ట్‌గా కావాలని ప్రకటించారని, దీంతో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలతో అతను చీకటి ఒప్పందాలు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని డీఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు స్కూల్ అసిస్టెంట్లను ఇన్విజిలేటర్లుగా నియమించాల్సిన నియమాలను పాటించకుండా, కొత్తగా నియమితులైన టీచర్లకు ఈ బాధ్యతలు అప్పగించడాన్ని వారు తప్పుబట్టారు. "దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు అరుణ్, గోపీ, మోహన్, చరణ్, ప్రవీణ్, వినయ్, పవన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## లంపి స్కిన్ వ్యాధి నివారణకు టీకాలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రేపు గొల్లచెర్ల రెవెన్యూ పరిధిలో గల హున్యా తండాలో ఆవులకు, మూడు నెలలు వయస్సు దాటిన దూడలకు లంపి స్కిన్ లేక ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాప్రిఫాక్స్ వైరస్ తో ఈ వ్యాధి వస్తుందని, కీటకాలు కాటు వేయడం వలన ఒక పశువు నుంచి మరొక పశువుకి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. దీంతో పశువులలో పాల ఉత్పత్తి పడిపోతుంది వ్యవసాయ పనులు చేయలేవు చిన్నదూడలు నీరసించి చనిపోతాయన్నారు. కాబట్టి, రాబోయే ఉపద్రవాన్ని ఎదుర్కోవాలంటే ఆవులకు, దూడలకు టీకాలు వేయడం ఒక్కటే మార్గమని తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయంలో కలకలం

**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల కేంద్రంలోని తాడిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఒక వ్యక్తి గురువారం పెట్రోల్ సీసా తో హల్ చల్ చేశాడు. వివరాల్లోకి మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన వ్యక్తి తనకు తన కుటుంబానికి ఉన్న భూమిని రెవిన్యూ రికార్డ్iలో లేకుండా తారుమారు చేశారనే అక్కసుతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ ని రెవెన్యూ ఇన్ స్పెక్టర్ (గిర్దవారు) టేబుల్ పై కొట్టడంతో టేబుల్ పై ఉన్న రికార్డులతో పాటు ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ లపై కొంత పెట్రోల్ పడింది. వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది కొయ్యూరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనతో తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఇది ఇలా ఉండగా పెట్రోల్ బాటిల్ తో హల్ చల్ చేసిన వ్యక్తికి మతిస్థిమితం లేనట్టు తెలుస్తోంది.

## బడ్జెట్ ప్రతులను తగలబెట్టిన బీఆర్ఎస్వీ



**వరంగల్ వాయిస్, కేయూ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకపోవడం అన్యాయం అని, విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ఈ ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం కాకతీయ యూనివర్సిటీలో బడ్జెట్ పత్రాలను తగలబెట్టి నిరసన తెలిపామని బీఆర్ఎస్వీ నాయకులు, కాకతీయ యునివర్సిటీ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్, ఇంచార్జ్ జెట్టి రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బడ్జెట్ లో విద్యా రంగానికి 7.57% నిధులను మాత్రమే కేటాయించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థుల పక్షాన పోరాడుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, నాయకులు రాసూరి రాజేష్, చిర్ర ప్రకాష్ గౌడ్, అన్వర్, తిరుమల్, అవినాష్, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

# మామిడి పండ్ల మార్కెట్ ప్రారంభం

- హాజరైన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ముసలమ్మకుంట గ్రామ శివారులో గురువారం నూతన మామిడిపండ్ల మార్కెట్‌ను తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ సమక్షంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజులను ఘనంగా స్వాగతించారు. అర్చకులు పూర్ణకుంభంతో సత్కారం చేయగా, అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి మార్కెట్‌ను ప్రారంభించిన మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు, అక్కడే రైతుల నుంచి మామిడి పండ్లను స్వయంగా కొనుగోలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మామిడిపండ్ల విస్తృత ఉత్పత్తిదారులలో ప్రముఖుడైన నిమ్మానీ శేఖర్ రావుని మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, మార్కెట్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం తన సీడీఎఫ్ నిధుల నుండి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. పండ్ల మార్కెట్ మరింత అభివృద్ధి కోసం డీపీఆర్ రూపొందించి, మంత్రుల సహకారంతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ బొమ్మేని రవీందర్ రెడ్డి, పండ్ల మార్కెట్ అధ్యక్షుడు వెల్ది సాంబయ్య, స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన-సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, మార్చి 20, 2025

# నియోజకవర్గ అభివృద్ధిపైనే ఆలోచన

**➲ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** నా ఆలోచన ఎల్లప్పుడూ నియోజకవర్గ అభివృద్ధిపైనే ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి మండలానికి సంబంధించిన 32మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 32లక్షల 03వేల 712రూపాయల విలువ గల చెక్కులను అలాగే 40మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 16లక్షల 74వేల 500 రూపాయల విలువగల చెక్కులను మొత్తం 48లక్షల 78వేల 212 రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి దరఖాస్తు లను పెండింగ్ లో ఉంచకుండా వెంటవెంటనే పరిశీలించి త్వరితగతిన దరఖాస్తుదారులకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేరుగా ఆర్థిక సహాయం చేరే విధంగా అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నిన్న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ వాస్తవానికి దగ్గరగా ఉందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ లో సాగు నీటి రంగానికి పెద్ద పీట వేస్తూ 23 వేల కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. ఏడాది లోగా దేవాదుల పెండింగ్ పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే వర్షాకాలం లోగ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి, ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. 16న నిర్వహించిన భారీ బహిరంగ సభను విజవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు, మహిళలకు, రైతులకు, యువతకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. మీరు ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో రానున్న రోజులలలో నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని ఎక్కువ నిధులు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం





**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్లో చేనేత రంగాన్ని విస్మరించి తీరని అన్యాయం చేసిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చేనేతను ఆదుకుంటామని ప్రచార ఆర్భాటమే తప్ప అందుకు అనుగుణంగా చర్యలు ఏమాత్రం లేవన్నారు. చేనేతకు, జౌళి (టెక్స్ టైల్ ) శాఖకు కలిపి రూ.370 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పినా అందులో పవర్ లూమ్ కు రూ.237.46కోట్లు, చేనేత, పవర్ లూం కలిపి రూ.102.54 కోట్లు , నేతన్నబీమాకు రూ.15 కోట్లు, రాష్ట్ర, జిల్లా కార్యాలయాల నిర్వహణకు రూ.35.83 కోట్లు ప్రతిపాదించారు. వాస్తవంగా చూస్తే ప్రత్యేకంగా చేనేత అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కేటాయించిందేమీ లేదన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలలోని 65 లక్షల మందికి నాణ్యమైన రెండు చీరలు నేయించి ఇస్తామన్న హామీ నెరవేర్చేందుకు నిధులు కేటాయించనందున అటు మహిళలను ఇటు నేతన్నలను దగా చేయడమేనన్నారు. చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకపోయి చేనేత కార్మికులు ఆత్మహత్యల పాలవుతుంటే ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని వారు ప్రశ్నించారు . చేనేత కార్మికులకు పని కల్పించేందుకు, సంక్షేమానికి, అభివృద్ధికి ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి టెక్స్ టైల్ రంగంతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా చేనేతకు కనీసం రూ.1000 కోట్ల రూపాయలు కేటాయించాలని వెంకట్రాములు, లక్ష్మి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల పోరాటాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## రేపు కలెక్టరేట్ ఎదుట దీక్ష



**వరంగల్ వాయిస్, జనగామ :** జనగామ జిల్లా పేరు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రంలో గల గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే దీక్ష కార్యక్రమంలో పార్టీ రాజకీయాలకతీతంగా గౌడ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని, బహుజన నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించాలని గౌడ సంఘాల సమన్వయ వేదిక నాయకులు అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, కన్న పరశు రాములు గౌడ్, పల్సం సోమన్న గౌడ్ లు కోరారు. దీక్షలో కూర్చునే ఆసక్తి గలవారు తమ పేర్లను కన్న పరశురాములు 9396723272 కు లేదా రఘునాథ గౌడ్ 9704106297 కు మేసేజ్ ద్వారా ముందుగా తెలుపాలని విజ్ఞప్తి చేశారు. శాంతి యుతంగా చౌరస్తాలోడా.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్ష ప్రారంభిస్తామన్నారు. గౌడ బంధువులు తమ తమ బహుజన మిత్రులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**▪ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి తొర్రూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ అధికారులతో కలిసి పలు పనులను పరిశీలించారు. హరిపిరాల రోడ్డులో అమృత్ పైప్‌లైన్ పనుల పురోగతిని తనిఖీ చేసి, త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ పైప్‌లైన్ ఎంతో కీలకమని, నిర్దేశిత గడువులోనే పనులు పూర్తి చేయాలని సూచించారు. తొర్రూరు పట్టణంలోని పెద్దచెరువ వద్ద మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం టీ యు ఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.5 కోట్లు మంజూరు చేసిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ప్రాజెక్టు, మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంతో ప్రజలకు విశ్రాంతి కోసం ఒక అందమైన విహార స్థలం లభిస్తుంది. పర్యాటక అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యం పెంపు, గ్రీనరీతో కూడిన ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఎమ్మెల్యే పనుల నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పనులను వేగంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాలను అభివృద్ధి చేసి, వాకింగ్ ట్రాక్, లైటింగ్, గ్రీనరీ ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ నాయకులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధి కోసం మరిన్ని పనులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంగళాపెల్లి రాం చంద్రయ్య, జినుగ సురేందర్ రెడ్డి, సోమ రాజశేఖర్, తునం శ్రవణ్, మేరుగు మల్లేశం, విజయ్ పాల్ రెడ్డి పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో రావు పద్మ పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సాయిబాబా మందిరంలో గురువారం బీజేపీ జిల్లా సీనియర్ నాయకురాలు రావు పద్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్న హారతిలో పాల్గొన్నారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ఆలయ మర్యాదలతో వారికి బాబా శేష వస్త్రాలను అందించగా మందిర పూజారులు మణిశర్మ, చందులు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బిల్లు ఆమోదంపై సీఎంకు అభినందనలు

**డాక్టర్ పరికిపండ్ల అశోక్**



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బీసీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింప చేసినందుకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక పక్షాన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు ఐక్యవేదిక పేర్కొంది. జిల్లా కేంద్రంలోని హస్తినాపూరి కాలనీలో గురువారం సీనియర్ అడ్వకేట్ కొండబత్తుల యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లాలోని వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు బీసీ బిల్లు పార్లమెంటులో పెట్టి ఆమోదింప చేయాలనే సంకల్పంతో ఒక్కతాటిపై వచ్చారని, ఈ దక్షిణ భారతదేశ కూటమికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం వహించి కేంద్ర ప్రభుత్వంలోని మోడీ సర్కార్‌పై ఒత్తిడిని పెంచి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్పించడానికి కీలక భూమిక పోషించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గంధసిరి ఉప్పలయ్య, కేదాసు మనస్వినితో పాటు, వివిధ బీసీ కుల సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు గుంజె హనుమంతు వడ్డెర, ముల్క కృష్ణమూర్తి పద్మశాలి, డాక్టర్ నవీన్ గౌడ్, జొన్నాయి కోడే శోభారాణి, మున్నూరు కాపు, ఆవుల సీతయ్య మున్నూరు కాపు, షేక్ మీరా సాహెబ్, కంభంపాటి విజయ్ గౌడ్, దుగ్గి రవి రజక, గొల్ల గోపు నాగరాజు యాదవ్, పుల్లూరి కృష్ణ గౌడ్, రమేష్ నాయి బ్రాహ్మణ, వంగా వెంకటరమణ గౌడ్, సున్న సుమన్ గాండ్ల, నల్లబెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ను కలిసిన మాదిగ ఉద్యమకారులు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మొదటి తరం మాదిగ ఉద్యమ నాయకులు మేకల నరేందర్ మాదిగ, ఇట్రాం శేఖర్ మాదిగ బృందం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాదిగ ఉద్యమకారులను సాదరంగా ఆహ్వానించి వారితో గత ఉద్యమ జ్ఞాపకాలను చర్చించారు. మాదిగ జాతి అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని త్వరలోనే మొదటి తరం మాదిగ ఉద్యమకారులతో ఒక సమావేశం నిర్వహిస్తామని వారికి సూచించారు. ఈ కార్యక్రమం లో మురళి మాదిగ, గంగారపు రాజు మాదిగ, డాక్టర్ మల్లికార్జున్ మాదిగ, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# సీఐ సృజన్ రెడ్డిని పరామర్శించిన తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** కరీంనగర్ టూ టౌన్ సీఐ కొరిపెల్లి సృజన్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం వారి స్వగ్రామమైన నిర్మల్ జిల్లా కేంద్రం శాంతినగర్ లోని వారి నివాసంలో సృజన్ రెడ్డి కుటుంబ సభ్యులను స్వర్గీయ తుమ్మేటి సమ్మిరెడ్డి తనయుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు తుమ్మేటి ప్రవీణ్ రెడ్డి పరామర్శించారు. అనంతరం స్వర్గీయ మధుసూదన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మధుసూదన్ రెడ్డి మృతి చెందడం వారి కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, పుల్యాల వినోద్ కుమార్, బిట్ల రాజు, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ తో గిరిజనులకు ఒరిగిందేమీ లేదు

## భూక్య సురేందర్ రాథోడ్ నాయక్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్ర బడ్జెట్‌తో గిరిజనులకు ఒరిగిందేమీ లేదని తెలంగాణ రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్ రాథోడ్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిందని, సమ్మక్క సారక్క పథకం కింద ప్రతి గిరిజన తండా, గూడెం పంచాయితీలకు 25 లక్షలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీలను మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద ప్రతి ఎస్టీ కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామన్నారు. మైదాన ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఐదు ఐటీడీఏలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత తొలి పూర్తిస్థాయి బడ్జెట్ లో గిరిజనులకు ఇచ్చిన హామీల గురించి ప్రస్తావన లేకపోవడం, బడ్జెట్ కేటాయింపుల్లో అవి కనిపించకపోవడం గిరిజనులను మోసం చేయడమేనని అభిప్రాయపడ్డారు. ఇది గిరిజనుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రశ్నించేలా ఉందని అన్నారు.

# ఉత్తమ గవర్నర్ అవార్డు ప్రదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అలై చిప్ప వెంకటేశ్వర్లు 2024- 25 100 శాతం గవర్నర్ గా ఎన్నికైనట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ ప్రకటించింది. నిరుపేద ప్రజలకు, విద్యార్థుల వృద్ధి కొరకు, నిరంతర సహకారంలో భాగంగా ఆహారం నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించడమే కాక నిరుద్యోగులకు, నిర్భాగ్యులకు, పేద పిల్లలకు తన సేవలను అందించినందుకు, 11 ఎల్ఎంఎఫ్ అవార్డులను సమకూర్చినందుకు, అసోసియేషన్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ చిప్ప వెంకటేశ్వర్లుకు 100 శాతం గవర్నర్ అవార్డును ఈ నెల 22లో చెన్నైలో హోటల్ సవేరాలో జరగబోయే కన్వెన్షన్ లో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా అవార్డును అందుకోబోతున్నారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## ఎంఈఓ ఈ.రాజి రెడ్డి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మండలంలో 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి ఈ.రాజి రెడ్డి తెలిపారు. హసన్ పర్తి మండలంలో పది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 984 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం పది మంది చీఫ్ సూపరింటెండ్లు, పది మంది డిపార్ట్ మెంట్ ఆఫీసర్స్, 99మంది ఇన్విజిరేటర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి పరీక్ష సెంటర వద్ద సీసీ కెమెరాలు, నీటి వసతి, ప్రాథమిక చికిత్స ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకొని ప్రశాంతంగా పరీక్షలు రాయాలని మండల విద్యాధికారి ఈ.రాజిరెడ్డి తెలిపారు.

# ప్రెస్ క్లబ్ ఆస్తి పన్నును చెల్లించిన కార్యవర్గం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజిక బాధ్యతగా ప్రతిఏటా ఆస్తి పన్ను చెల్లించడంలో భాగంగా ఆస్తి పన్ను చెక్కును గురువారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు క్లబ్ ఆవరణలో మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్ బిల్ కలెక్టర్ టి.విజయ్ కుమార్, వార్డు అధికారిణి నీరటి నవ్యశ్రీకి అందించారు. రెండేళ్ల కాలంలో మూడు సంవత్సరాల పన్నును చెల్లించడం జరిగిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఒక ఏడాది పన్నును అదనంగా చెల్లించాల్సి వచ్చిందని ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో సభ్యులు కానీ కొందరు వ్యక్తులు ప్రెస్ క్లబ్ కార్యవర్గంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని, వారికి జర్నలిస్టుల సొమ్ము దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. ప్రెస్ క్లబ్ పాలన పూర్తి పారదర్శకంగా, బ్యాంకింగ్ ద్వారా మాత్రమే జరుగుతున్నదని తెలిపారు. ప్రెస్ క్లబ్ చరిత్రలో ఎన్నడు లేనివిధంగా క్లబ్ కు వచ్చే ఆదాయాన్ని పెంచడమే కాకుండా... చ్చిన నిధులను దుర్వినియోగం చేయకుండా "కాపలా" కాస్తున్నామని పేర్కొన్నారు. ఒకరిద్దరూ క్రమశిక్షణ లేని వర్కింగ్ జర్నలిస్టులు కానీ వ్యక్తులు చేసే ఆరోపణలను పట్టించుకోవద్దని గౌరవ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఏ అనుమానం ఉన్న నివృత్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేసే వ్యక్తులు పద్ధతి మార్చుకోకపోతే ఐటీ చట్టం ప్రకారం వారిపై చట్టపరంగా ముందుకు వెళ్తామని హెచ్చరించారు. ప్రతి వర్కింగ్ జర్నలిస్ట్ కు అండగా నిలుస్తామని ఈనెలలోనే క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ అందించనున్నామని చెప్పారు. జర్నలిస్టుల దశాబ్దాల కళ "ఇంటి స్థలాల" విషయంలోనూ త్వరోలోనే తీపి కబురు చెబుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, కార్యవర్గ సభ్యులు జనగాని ఆంజనేయులు, ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, రాంరాజ్, కృష్ణ పాల్గొన్నారు.

# టీపీసీసీ చీఫ్ ను, మంత్రి పొన్నంను కలిసిన ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుతో పాటు ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గౌడ్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌లను కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలు ఈ నిర్ణయానికి రుణపడి ఉంటాయన్నారు. ఈ బిల్లుల ఆమోదంతో కాంగ్రెస్ పార్టీ నిజంగా సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లే పార్టీగా నిలిచిందని ఆమె అభిప్రాయపడ్డారు.

# సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్ద పీట



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సామాజిక న్యాయానికి కుల జనగణన ఎక్సేరే లాంటిదని, సామాజిక న్యాయమే తన జీవిత లక్ష్యమని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి, అసెంబ్లీ ఎన్నికల వేళ కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు గురువారం కోర్టులోని అంబేద్కర్ హాల్ లో మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ముద్దసిర్, కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు,రాష్ట్ర కన్వీనర్లు కూనూరు రంజిత్ గౌడ్, పిల్లి కార్తీక్,కందుకూరి రజనీకాంత్ వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు అంబరీష్ రావు, పులి సత్యనారాయణ, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గునిగంటి శ్రీనివాస్, దయాన్ శ్రీనివాస్,కొక్కొండ రమేష్, సిద్దునాయక్, చిర్ర రాజు, రమేష్ నాయక్, సురేష్, ఎగ్గడి సుందర్ రామ్, పల్లె ప్రశాంత్, శ్రీలత, ప్రియాంక, తులసిగారి రాజబాపు, అమృత రావు, దండు మోహన్, హరీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## ఎంఈఓ గాయపు లింగారెడ్డి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి మండలంలో 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి గాయపు లింగారెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వాహణ సజావుగా జరిగేలా చూడాలని పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్ర కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. పర్వతగిరి మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు పాఠశాలల నుంచి మొత్తం 536 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పర్వతగిరి ఉన్నత పాఠశాల నుంచి 200, ఆదర్శ పాఠశాల నుంచి 179, సాంఘిక సంక్షేమ బాలికల కోసం గురుకుల విద్యాలయం నుంచి 157 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. 36 మంది ఉపాధ్యాయులకు ఇన్విజిలేటర్ విధులు కేటాయించారు. పర్వతగిరి ఉన్నత పాఠశాల నుంచి13, ఆదర్శ పాఠశాల నుంయి 12, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి 11 మంది ఉపాధ్యాయులను నియమించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులుగా పాకా రమేష్ బాబు, పి.కుమారస్వామి, ఎస్. హేమమాలిని, ఎ.కిషన్ రావు, డి.రవికుమార్, వి.వెంకటనారాయణ పరీక్షలను పర్యవేక్షించనున్నారు.

# 23న జనరల్ బాడీ సమావేశం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మార్చి 23న జనర్ల బాడీ సమావేశంలో పాల్గొనాలని పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులకు ఈవీ శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అడ్ హాక్ కమిటీ సభ్యుల సమావేశం సంఘం కన్వీనర్ ఈవీ శ్రీనివాస్ రావు అధ్యక్షతన సంఘ కార్యాలయంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈవీ శ్రీనివాస్ రావు పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ మార్చి 23న జరిగే జనరల్ బాడీ మీటింగ్ కి పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని, సంఘ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సంఘ అడ్ హాక్ కమిటీ సభ్యులందరికీ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అడ్ హాక్ కమిటీ సలహాదారులు స్వామి, సభ్యులు మేకల అక్షయ్ కుమార్, సతీష్ రెడ్డి, ఈ శ్రీనివాస్ రావు, ఉమేందర్, దొడ్డిపల్లి కుమార్, రాజు, రజిత, భిక్షపతి, వసంత్, ఆరిఫ్, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

# జాక్ చిత్రం నుంచి కిస్ సాంగ్ విడుదల




## బొమ్మరిల్లు భాస్కర్ దమ్మున్న దర్శకుడన్న సిద్దూ


సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా.. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జాక్' . వైష్ణవి చైతన్య కథానాయిక. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణంలో ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలోని కిస్ సాంగ్‌ను గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆసక్తికర విషయాలు పంచుకుంది. ప్రతి మనిషికి ఒక గోల్ ఉంటుంది. దాన్ని ఎలా సాధిస్తామనేది ముఖ్యం. అదే ఈ సినిమాలో చూపించారు. ఆడియన్స్‌కు వినోదాన్ని పంచడమే మా ముఖ్య ఉద్దేశం. 'ఆరెంజ్' సినిమాలో ఒక పాత్రలో నటించాను. ఇన్నేళ్ల తర్వాత బొమ్మరిల్లు భాస్కర్‌తో పని చేయడం అప్పటి రోజుల్ని గుర్తు చేసిందని సిద్ధూ జొన్నలగడ్డ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ప్రతి హీరో కెరీర్‌లో ఒక ప్రత్యేక పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నా కెరీర్‌కు టిల్లు పాత్ర అలా గుర్తుండిపోతుంది. రామ్‌చరణ్‌తో కలిసి 'ఆరెంజ్' సినిమాలో నటించాను. భవిష్యత్తులో అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆయనంటే నాకు చాలా ఇష్టం. నేను దర్శకుడి ప్రతిభ చూస్తాను. ఆయన హిట్ సినిమాలు తీస్తున్నారా, లేదా అని నేనెప్పుడూ ఆలోచించలేదు. బొమ్మరిల్లు భాస్కర్ తీసిన ప్రతి సినిమా కొత్తగానే ఉంటుంది. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశానని అన్నారు.



# బ్రిటన్ పార్లమెంట్ పురస్కారం మరువలేనిది

**సోషల్ మీడియా వేదికగా ఆనందం పంచుకున్న చిరు**

బ్రిటన్ పార్లమెంటు–లోని హౌస్ ఆఫ్ కామన్స్‌లో తనకు జరిగిన సత్కారంపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఈ ఆనందం గురించి చెప్పేందుకు మాటలు సరిపోవంటూ.. తన ప్రయాణంలో భాగమైన కుటుంబ సభ్యులు, అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. యూకే పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో.. నన్ను సత్కరించినందుకు హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ జీవిత సాఫల్య పురస్కారం నేను అందుకోవడం సంతోషంగా ఉంది. ఈ గౌరవం నన్ను మరింత ఉత్సాహంగా ముందుకెళ్లేలా చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సినీ రంగానికి, సమాజానికి చిరంజీవి చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు 'బ్రిడ్జ్ ఇండియా' సంస్థ జీవిత సాఫల్య పురస్కారం అందజేసింది. టాలీవుడ్ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్, 'విశ్వంభర' చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపాయి. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో చిరంజీవి నటిస్తున్నారు.



# వరుస సినిమాలలో దూసుకెళ్తుంది

మీనాక్షి చౌదరి.. సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది. హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. ఆ తర్వాత అడివి శేష్ సరసన 'హిట్–2'లో చేసింది. కెరీర్ బిగినింగ్ లో కాస్త స్లోగా సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. కెరీర్ స్టార్టింగ్ లోనే సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం అందుకుంది. మహేష్ బాబు నటించిన గుంటూరు కారంలో నటించి మెప్పించింది. ఇవి కాక రీసెంట్ గా విశ్వక్ సేన్, వరుణ్ తేజ్, దుల్కర్ సల్మాన్ హీరోలు సినిమాల్లో నటించి మెప్పించింది. రీసెంట్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. అలాగే కొన్ని తెలుగు సినిమాలను ఓకే చేసింది. ఇక సోషల్ మీడియా ఈ బ్యూటీ పంచుకునే ఫోటోలు కుర్రాళ్లను తెగ కవ్విస్తున్నాయి. ఇలాంటి లవర్ మనకు రావాలి అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. తన అందంతో అంతలా నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది ఈ చిన్నది.



# రజనీ స్ఫూర్తితో.. సన్నివేశం

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'లూసిఫర్2: ఎంపురాన్. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ముస్తాబవుతోంది. 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్ సొంతం చేసుకున్న 'లూసిఫర్'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా 'లూసిఫర్'లోని ఓ సన్నివేశం గురించి పృథ్వీరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. లూసిఫర్' సినిమా మొత్తానికి మోహన్‌లాల్ ఎంట్రీ సన్నివేశం హైలైట్‌గా నిలిచింది. ఆ సన్నివేశానికి రజనీకాంత్ స్ఫూర్తి అని దర్శకుడు తెలిపారు. 'మోహన్‌లాల్ అంటే ఎవరో చెప్పడానికి లూసిఫర్‌లో ఒక్క సన్నివేశం సరిపోతుంది. ఆ ఎంట్రీ సీన్ మొత్తాన్ని రజనీకాంత్ గురించి విన్న కథను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించాను. రజనీ నివాసం ఉండే పోయెస్ గార్డెన్ వీధిలో ఎప్పుడూ ఎలా ఉంటుందో ఒక వార్తా కథనంలో చదివాను. ఆ కథనాన్ని చదివిన తర్వాత రజనీకాంత్‌ని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీన్ రాశాను. అదే మోహన్‌లాల్ ఎంట్రీ– సీన్. సినిమాలో దానికి మంచి ఆదరణ లభించిందని చెప్పారు. రజనీకాంత్‌కు పృథ్వీరాజ్ వీరాభిమాని అని తెలిసిందే. గతంలోనూ ఎన్నో సందర్భాల్లో రజనీకాంత్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తంచేశారు. 'లూసిఫర్ 2' –ట్రైలర్‌ను కూడా ఆయన మొదట రజనీకాంత్‌కు చూపించారు. రజనీ ఈ ట్రైలర్ చూసి తననెంతో ప్రశంసించారని ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తాను రజనీ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు– చెప్పారు. ఒకసారి ఆ అవకాశం వచ్చినా డేట్స్ సర్దుబాటు– చేయలేక డైరెక్ట్ చేయలేకపోయినట్లు– తెలిపారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, మార్చి 20, 2025




# షటిల్‌లో కేశవమూర్తి జట్టు విజయం

- 15-6 ,15-7 స్కోరుతో విజయ దుందుభి
- గోవాలో 47వ జాతీయ మాస్టర్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గోవాలోని ముపాస పట్టణంలో జరుగుతున్న 47వ జాతీయ స్థాయి మాస్టర్స్ షటిల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో గురువారం గడ్డం కేశవమూర్తి, కొత్తగట్టు సుధాకర్ జట్టు విజయ దుందుభి మోగించింది. గుజరాత్ జట్టుపై 15-6 ,15-7 స్కోర్ తో సునాయాశంగా విజయం సాధించారు. అద్భుతమైన షాట్లతో ప్రత్యర్థులను మట్టికరిపించారు. గోవాలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న నలభై ఏడో భారత మాస్టర్స్ (వెటరన్) నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు హనుమకొండ జేఎన్ఐఎస్ నుంచి 18 మంది క్రీడాకారులు తరలి వెళ్లారు. టీబీఏ అధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో జాతీయ క్రీడాకారులు గడ్డం కేశవమూర్తి, కొత్తగట్టు సుధాకర్, కొలుగూరి ప్రభాకర్ రావు, పీచు రాజిరెడ్డి, కోట రమణారెడ్డి, పూజారి విజయకుమార్, పొరిక విజయ్ కుమార్, కోమాకుల మధుకర్, పడాల రాజు ప్రసాద్, ఎండ్ల భిక్షపతి, సుద్దాల సంపత్ తదితరులు గోవా వెళ్లిన వారిలో ఉన్నారు.









## ఘనంగా తక్కళ్లపెల్లి పురుషోత్తం జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మాజీ మంత్రి తక్కళ్లపెల్లి పురుషోత్తం రావు 88వ జన్మదిన వేడుకలను గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఆయన స్వగృహంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా పురుషోత్తం రావు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కుల గణన చేపట్టం ద్వారా భవిష్యత్తులో బీసీలు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాసి రాందేవ్, కొంటి భాస్కర్, క్రాంతి కుమార్, సీహెచ్ అశోక్, రంగారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## తూనికల శాఖ తనిఖీలు



### థియేటర్ పై కేసు నమోదు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని పలు సినిమా థియేటర్లలో జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారి జి.అశోక్ బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తాగునీరు, కూల్ డ్రింక్స్ తదితరాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టినట్లు అశోక్ బాబు వెల్లడించారు. ఈ నగరంలోని ఒక థియేటర్ పై కేసు నమోదు చేసి రూ.2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ ఎమ్మార్పీకంటే అధికంగా వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ అంటేనే సంక్షేమం

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- రూ.10 కోట్ల పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాంగ్రెస్ అంటేనే సంక్షేమం.. సంక్షేమం అంటేకే కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దన్నసరి అనసూయ సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని 15 గ్రామాల్లో రూ.10 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ లతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. గ్రామాలకు చేరుకున్న మంత్రి సీతక్కకు మహిళలు నృత్యాలు చేస్తూ పూలుజల్లి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..



కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని అన్నారు. పేదల సంక్షేమానికి పాటు పడుతుందని, ఇలాంటి మారుమూల వెనుకబడిన ప్రాంతాలకు ఇందిరమ్మ ఇళ్ళను అధికంగా మంజూరు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు సమాచారం సేకరించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**



**వరంగల్ వాయిస్, క్రైం :** చట్టవ్యతిరేక కార్యకలపాలపై ముందస్తూ సమాచారాన్ని సేకరించడం స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ప్రధాన కర్తవ్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలియజేసారు. గురువారం వరంగల్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీలు జితేంద్ రెడ్డి, పార్థసారథి, రాజు, గురుస్వామి, శేకర్, సంజీవ్, చంద్రమోహన్, డీఏఓ ఇషాక్‌తో పాటు ఎస్.ఐలు, ఏ.ఎస్.ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు. అనంతరం నిట్ డైరెక్టర్ బైద్యధర్ సుబుధిని లో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారులు జయంతి తో పాటు సఖి సెంటర్ కౌన్సిలర్ తదితరులు సీపీని మర్యాద పూర్వకం కలసి మొక్కను అందజేశారు.

# మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు

- కాళేశ్వరంలో ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ అధికారులు
- మెరుగైన సదుపాయాలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని వారు క్షేత్ర స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలం నిర్ణయించడం, వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, పురుషులు, మహిళల కోసం శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్షించారు. గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, వీఐపీ ఘాట్ నుంచి గోదావరి ఘాట్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తి చేయాల్సిన శాశ్వత, తాత్కాలిక పనులకు ముందుగానే షెడ్యూల్ తయారు చేసుకోవాలని, సిబ్బందిని పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అంచనాల్లో వ్యత్యాసాలు, చేపట్టే పనులపై నివేదికలు రెండు రోజుల్లో అందచేయాలని సూచించారు. పుష్కర సమాచారం తెలిసేలా ప్రత్యేకంగా యాప్ తయారు చేయాలని, విస్తృత ప్రచారానికి అంబాసిడర్ ను నియమించాలని తెలిపారు. పుష్కరాల 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈఓను ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం గోదావరిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరిలో నీటి నిల్వలను పరిశీలించాలని తెలిపారు. సత్రం పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ప్రాంతాలలో ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. గోదావరిలోకి భక్తులు వెళ్ళకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అంతకు ముందు వీఐపీ ఘాట్, గోదావరి ఘాట్ వద్ద చేపట్టనున్న పనులను సత్రం పనులను పరిశీలించారు. తదుపరి ఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టనున్న పనుల ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆర్జేసీ రామకృష్ణారావు, పంచాయతిరాజ్ ఇరిగేషన్ ఆర్ డబ్ల్యూఎస్ విద్యుత్ దేవస్థానం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com